తెలంగాణ పార్క్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం


పార్క్‌లో ఏర్పాటు చేసిన బెంచీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని తెలంగాణ పార్క్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని తెలంగాణ పార్క్‌ను సందర్శించారు. పార్కులో అభివృద్ధి పనుల్లో భాగంగా సందర్శకులు కూర్చోవడానికి కొత్తగా ఏర్పాటు చేసిన 8 సిమెంట్ బెంచీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పార్క్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వాకింగ్, వ్యాయామం కోసం వచ్చేవారు కూర్చుని సేద తీరేందుకు ఉపయోగపడతాయన్నారు. త్వరలోనే పార్క్ మరింత అభివృద్ధి జరిగి ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్, మంచి రాజేష్, సుందర్ నారాయణ, అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, రాకేష్ యాదవ్, మహేందర్ యాదవ్, వెంకట్ రెడ్డి, రైక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ రైస్ సెంటర్ ప్రారంభం..

కొత్తపేట డివిజన్ గాయత్రిపురం కాలనీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ రైస్ సెంటర్‌ను బుధవారం కార్పొరేటర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదలకు కేవలం రూ.29 రూపాయలకే నాణ్యమైన బియ్యం అందించాలనే ఉద్దేశంతో భారత్ రైస్ సెంటర్లను ప్రవేశపెట్టారన్నారు.

ప్రభుత్వ పథకాలపై ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన

వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ



చాదర్‌ఘాట్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలపై ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన కల్పిస్తున్నామని రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ తెలిపారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థికంగా ఉపాధి కల్పించేందుకు ఏకనాయకల్ రిహాబిలిటేషన్ స్కీమ్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 70 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. జిల్లాల వారీగా ప్రతి జిల్లాకు 100 మందికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించామని తెలిపారు. వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం –2019 ప్రకారం వారి హక్కులపై జిల్లా అధికారుల చేత బుక్స్ పంపిణీ చేశామని తెలిపారు. టీజీ ఐడీ కార్డ్స్ నేషనల్ పోర్టల్ కోఆర్డినేషన్‌తో రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. డిపార్ట్‌మెంట్ తరఫున ఏ దిక్కూ లేని ట్రాన్స్‌జెండర్లకు షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేశామని వివరించారు. అదే విధంగా ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ ఏర్పాటు చేయించామన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే మలక్‌పేటలోని సంబంధిత అధికారులను కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

దేశ ప్రగతికి యువత సహకారం అందించాలి



పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నాగోలు: నేటి యువత దేశ కాల పరిస్థితులను అర్థం చేసుకొని దేశ ప్రగతికి తమ వంతు సహకరించాలని వివేకానంద కేంద్రం ప్రతినిధులు రవి నాయుడు, సురభి భార్గవ్ అన్నారు. వివేకానంద కేంద్రం, కన్యాకుమారి హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో కొత్తపేటలో బుధవారం 'భారత్ 2047 అవర్ విజన్ మై మిషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లైనా సందర్భంగా, వివేకానంద కేంద్రాన్ని కన్యాకుమారిలో స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు 'భారత్ 2047 అవర్ మిషన్ మై మిషన్' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. పలు అంశాలపై నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివేకనంద కేంద్ర ప్రతినిధులు పూడి శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, న్యాయమూర్తులుగా వై. గణేష్, పీవీఎస్ శ్రీనివాస్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


గణపతి పూజలో పాల్గొన్న వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు

హస్తినాపురం: కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగ మధుసూదన్‌రెడ్డి దంపతులు గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, దీక్షాధారణ, అంకురార్పణ, గోపూజ, చండీమండపం, యాగశాల ప్రవేశం, శ్వేతార్కమూలగణపతి, హోమం, హారతితో మొదటిరోజు పూజలు ముగిశాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సద్ది సందీప్‌రెడ్డి, ఎల్.రమేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లికార్జున్ , మిర్యాల అంజయ్యగుప్తా, సూర్య ప్రకాశ్‌గుప్తా, వంగ ప్రవీన్‌రెడ్డి, జి.నరేందర్ రెడ్డి, ఎం.కేశవరెడ్డి, నిర్మలేశ్ గుప్తా పాల్గొన్నారు.

లాభాల్లో సహకార సంఘం

అప్పుల ఊబి నుంచి ఆర్థిక బలోపేతం దిశగా బండ్లగూడ ఖాల్సా సొసైటీ



బాలాపూర్‌లో ఉన్న బండ్లగూడ ఖాల్సా సొసైటీ భవనం

బడంగ్‌పేట్: రైతులను ప్రోత్సహించేందుకు దేశ వ్యాప్తంగా ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. కానీ కొన్ని చోట్ల సర్కారు నుంచి సరైన ప్రోత్సాహం లభించక సంఘాలు నిర్వీర్యమవుతున్నాయి. నష్టాల్లో కూరుకుపోయిన సహకార సంఘాన్ని పటిష్ఠమైన ప్రణాళికతో లాభాల బాట పట్టించారు. ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా బండ్లగూడ ఖాల్సా సొసైటీ బాలాపూర్ దూసుకుపోతోంది. 1945లో బండ్లగూడ ఖాల్సా పేరుతో బాలాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. బాలాపూర్, బండ్లగూడ, మైలర్‌దేవర్‌పల్లి, మల్లాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాలకు చెందిన రైతులు ఇందులో సభ్యులుగా ఉంటారు.

సకాలంలో వసూళ్లు

బండ్లగూడ ఖాల్సా కొన్నేళ్లుగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 17 ఏళ్ల నుంచి పాలకవర్గం కొత్త నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడంతో లాభాలు ఆర్జిస్తున్నారు. సంఘంలో 2,800 మంది సభ్యులకు మొత్తం రూ.5.98 కోట్ల రుణాలు ఇచ్చారు. పొదుపు ఖాతా కింద నగదు జమ చేసుకుంటే అందుకు మూడింతలు కలిపి రుణాలు ఇస్తున్నారు. తక్కువ వడ్డీకే రూ.11 కోట్ల గోల్డ్ లోన్లు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.9 కోట్ల మేర డిపాజిట్లను సేకరించారు. క్రాఫ్, స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలకు అందిస్తున్నారు. సంఘం లాభాల నుంచి షేర్ కలిగిన రైతులకు 10 శాతం డివిడెంట్ ఇస్తున్న ఏకైక సొసైటీ ఇదే కావడం గమనార్హం. సకాలంలో బకాయిలను వసూలు చేసి లాభాల బాటలో సంఘం సాగుతోంది.


17 ఏళ్ల కృషి



జిల్లాలోని అన్ని సొసైటీలను పరిశీలించాను. ఈ సంఘం నగరానికి చేరువలో ఉన్నది కాబట్టి వ్యవసాయంతో పాటు కమర్షియల్ ఆలోచనలు చేసి బహుళ నిర్ణయాలు తీసుకున్నాం. ఒక్కొక్కటిగా ఫలితాలు వస్తుండటంతో ఇప్పుడు కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నాం. దీని వెనక 17 ఏళ్ల శ్రమ ఉంది.

– సింగిరెడ్డి పెంటారెడ్డి, చైర్మన్

ప్రజల సహకారం భేష్



ప్రజలు, ఖాతాదారులు, స్థానికులు సహకారం అందిస్తున్నారు. సంఘం కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలే బ్యాంకును మెరుగైన స్థానంలో నిలిచేలా ఉంచింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు కూడా పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. కార్యవర్గం సభ్యుల చొరవ సైతం అమోఘం.

– కొలన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్

నిఘా లేక రెచ్చిపోతున్నారు!

ఖాళీ స్థలాల్లో మందుబాబులు, జూదరుల తిష్ట


ఎన్టీఆర్‌నగర్ సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వీఎంహోమ్ స్థలం

- తాగిన మైకంలో ఘర్షణలు
- భయాందోళనకు గురవుతున్న ఎన్టీఆర్ నగర్, చిత్రాలేఅవుట్ కాలనీల ప్రజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని లేఅవుట్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మందు బాబులు, గంజాయి సేవించే వారు రాత్రి పూట ఇక్కడ తిష్ట వేస్తున్నారు. మత్తులో లొల్లి చేస్తూ రెచ్చిపోతూ స్థానికులకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్ సమీపంలో విక్టోరియా మెమోరియల్(వీఎంహోమ్) పాఠశాలకు చెందిన స్థలం ఉంది. గతంలో ఇక్కడ కూరగాయలు, పండ్లు పండించి విద్యార్థుల కోసం తరలించే వారు. అయితే, కొన్నేళ్లుగా ఈ స్థలాన్ని వీఎం హోమ్ వారు పట్టించుకోవడం మానేయడంతో అక్కడ పెద్ద ఎత్తున చెత్తాచెదారం చేరింది.

- గతంలో కురిసిన భారీ వర్షాలకు విక్టోరియా మెమోరియల్ తోట స్థలం ప్రహరీ కూలిపోయింది. దీంతో ఎన్టీఆర్‌నగర్, భరత్ నగర్, శివమ్మ నగర్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి యువకులు ఈ ఖాళీ స్థలంలోకి వచ్చి గంజాయి, మద్యం సేవిస్తూ లొల్లి చేస్తున్నారు. దీనికి తోడు అక్కడ పెద్ద ఎత్తున చెట్లు ఉండటంతో అటుగా వెళ్లేందుకు స్థానికులు జంకుతున్నారు.
- ఇక్కడ కొందరు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో జోరుగా జూదం ఆడుతున్నట్లున్నారు.
- అక్కడకు వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో పోలీసు పెట్రోలింగ్ పోలీసులు సైతం ఆ ప్రాంతంలోకి వెళ్లడం లేదు.
- చిత్రా లేఅవుట్ కాలనీ పక్కనే ఉన్న స్థలంలో గతంలో హెచ్‌ఎండీఏ అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం స్థలం వదిలేశారు. పక్కనే వీఎంహోం స్థలం ఖాళీగా ఉండటంతో పాటు, హెచ్‌ఎండీఏ స్థలం కూడా ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.
- గతంలో ఈ స్థలాలకు చుట్టూ పెన్సింగ్, ప్రహరీ ఉండేంది. ఇప్పుడు లేక పోవడం, అక్కడ నిఘా లేక పోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డంగా మారింది.
- ఇప్పటికైనా విక్టోరియా మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు, హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించి వర్షాలకు కూలిపోయిన ప్రహరీలను తిరిగి నిర్మించి అక్కడ ఎలాంటి అసాంఘింక కార్యక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కూడా ఖాళీ స్థలాలపై రాత్రి పూట నిఘా ఉంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

జూదం ఆడుతూ, గంజాయి తాగుతూ..



ఎన్టీఆర్‌నగర్ సమీపంలో ఉన్న వీఎం హోం తోటలో గతంలో కూరగాయాలు పండించేవారు. కొంత కాలంగా స్థలం ఖాళీగా ఉండటంతో స్థానిక యువకులు అసాంఘింక కార్యక్రమాలకు అడ్డగా మార్చుకున్నారు. ఉదయం, రాత్రి సమయాలలో జూదం ఆడుతూ , గంజాయి, మద్యం తాగుతున్నారు. అక్కడికి ఎవరినీ రానీయకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి.

– బాతరాజు నర్సింహ, ఎన్టీఆర్‌నగర్

పోలీసు నిఘా పెట్టాలి



ఎన్టీఆర్ నగర్‌లోని వీఎంహోం స్థలానికి చుట్టూ పహరీ నిర్మించాలి. ఖాళీగా ఉన్న స్థలాల్లోకి యువకులు రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. బస్తీలో గంజాయి తాగేవారు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. గంజాయిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

– ఇస్మాయిల్, ఎన్టీఆర్ నగర్


గత వర్షలకు కూలిపోయిన వీఎం హోమ్ తోట ప్రహరీ


మందుబాబులకు అడ్డగా మారిన చిత్రలేబెట్ కాలనీలో హెచ్‌ఎండీఏ స్థలం

నూతన గవర్నర్‌కు సన్మానం


తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీపీ రాధాకృష్ణన్‌ను బుధవారం రాజ్‌భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి నవీన్ బండారి, జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు – సైదాబాద్


రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా గీత సెల్ రాష్ట్ర కన్వీనర్ పంజాల శ్రవణ్‌కుమార్‌గౌడ్, కో–కన్వీనర్ రాగల కిరణ్‌కుమార్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బీబీఆర్ వేణు. – దిల్‌సుఖ్‌నగర్

క్రీడలతో శారీరక దృఢత్వం

చంపాపేట: విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే వారు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పొందుతారని భాష్యం పాఠశాలల ఇన్‌చార్జి అంకమరావు అన్నారు. బుధవారం చంపాపేటలోని భాష్యం లిటిల్ చాంప్స్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోకో, కబడ్డీ, మ్యూజికల్ చైర్ వంటి పోటీల్లో పాల్గొని సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీత సునీల్, నాయక్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న అంకమరావు

ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీలు, ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: మమతానగర్, బసవేశ్వర్ కాలనీలోని పాత శివాలయం శ్రీశైల మల్లికార్జున సమాజోత్తవ ఫౌండేషన్ ట్రస్ట్–నాగోలు ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి (మరకత లింగం) శ్రీ ఆది జగద్గురు పండితారాధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ట, శ్రీ మహాత్మా బసవేశ్వర అక్క మహాదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వామిజీలు శ్రీమద్ ఉజ్జయిని జగద్గురు, శ్రీశైలం జగద్గురు శ్రీమద్ కాశీ జగద్గురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ సమస్యలు పరిష్కరిస్తా


సమస్యలోని సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: శ్రీరాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు త్వరలో పరిష్కారమయ్యేలా చూస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి సంయుక్త కార్యదర్శి ప్రసాద్, నగమణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, అడ్వైజర్లు రంగారెడ్డి, రాధాకృష్ణ, కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం, ఆరోగ్యం


వాకర్స్‌ను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్

చైతన్యపురి: సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతుల్లో బుధవారం గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యోగాసనాల ద్వారా మానసిక వికాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. వాకర్స్ కోసం యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రియదర్శిని పార్కు సంరక్షణ, అభివృద్ధికి పర్యాటక శాఖ చర్యలు తీసుకునేలా చూడాలని కార్పొరేటర్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యోగా సాధకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఆదిలక్ష్మి అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి జరిగే తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ కోరారు. బుధవారం ఆలయ ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహాచార్యులు కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాల నుంచి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం నుంచి ప్రారంభమై 24 వరకు కొనసాగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు విలాస్, యాదగిరిరెడ్డి, నాయకులు సుధాకర్, శివయ్య, మదన్‌మోహన్, శ్రీనివాస్ యాదవ్, నర్సింహగౌడ్, శ్రీనివాస్‌నాయక్, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



చైతన్యపురి: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 14 ఎంపీ స్థానాలు గెలుపొందటం ఖాయం అని రాష్ట్ర రోడ్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మల్‌రెడ్డి మాట్లాడుతూ..పేదలకు అనుకూలమైన ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాంది పలికారన్నారు. 100 రోజులు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు, హామీలను నేరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. పలువురు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పుస్తెలు, మెట్టెలు వితరణ


పుస్తె, మెట్టెలు అందజేస్తున్న స్వర్ణకార సంఘం నాయకులు

చైతన్యపురి: ఈనెల 22న వివాహం చేసుకోబోతున్న నిరుపేద జంటకు దిల్‌సుఖ్‌నగర్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బంగారు పుస్తెలు, వెండి మెట్టెలు బుధవారం అందజేశారు. భవిష్య, సాయి చరణ్‌ల జంట కుటుంబాలకు ఆర్థిక స్థోమత సరిగా లేకపోవటంతో విషయం తెలుసుకున్న సంఘం నాయకులు వారి వివాహానికి అవసరమైన పుస్తె, మెట్టెలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘం సలహాదారు చింతమడక శ్రీనివాసచారి, అధ్యక్షుడు రవిచారి, ప్రధాన కార్యదర్శి లవకుమార్, కోశాధికారి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటాచారి, ప్రచార కార్యదర్శి తిరుపతాచారి, బావోజు రవి, గోవర్ధనాచారి, అనంతాచారి, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ సేవా పురస్కారం ప్రదానం

దిల్‌సుఖ్‌నగర్: మక్ష గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు రాణి రుద్రమదేవి పురస్కారం, పురుషులకు శివాజీ మహరాజ్ జాతీయ సేవా పురస్కారం అందజేశారు. ఇందులో భాగంగా ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు శివాజీ మహరాజ్ సేవా పురస్కారాన్ని ముఖ్య అతిథి మిస్ ఆసియా ఇంటర్నేషనల్, మిస్ ది ప్లానెట్ రశ్మి ఠాకూర్ చేతుల మీదుగా అందజేశారు. మక్ష గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దినేష్ చెరిపల్లి, ఫిల్మ్ డైరెక్టర్ సంజనా రెడ్డి, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోకియా బేగం, జీ తెలుగు సరిగమప సింగర్ దాసరి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి షాపు దగ్ధం

హస్తినాపురం: ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలి షాపు పూర్తిగా కాలిబూడిదైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక రైతుబజార్ దగ్గర ఉన్న మిర్చి డబ్బాలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద శబ్దం వచ్చింది. ఏం జరిగిందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలోనే మంటల్లో షాపు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, పోలీసులు సమాచారం మేరకు హయత్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్యాస్ సిలిండర్ పేలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. మిర్చి డబ్బా నిర్వాహకుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై భార్యాభర్తల దాడి

నాగోలు: కేసు విషయమై కోర్టుకు హాజరైన మహిళలపై భార్యాభర్తలు దాడి చేసిన ఘటన ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామంతాపూర్ లోని గణేష్ నగర్‌కు చెందిన దండెం సరిత బుధవారం పాత కేసు నిమిత్తం రంగారెడ్డి జిల్లా కోర్టుకు వచ్చింది. సరితపై గతంలో కేసు పెట్టిన భార్యాభర్తలు రజిత, రవీందర్‌రెడ్డి ఆమె వద్దకు వచ్చి దూషించారు. అనంతరం భార్యాభర్తలు కలిసి సరితపై దాడి చేశారు. దీంతో బాధితురాలు ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

నాగోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 33.42 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్ పాత గ్రామానికి చెందిన పుచ్చల జగత్‌రెడ్డి తన నివాసంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. అలాగే, ఎల్‌బీనగర్ చౌరస్తాలోని టీ స్టాల్ వద్ద షేక్ రహీం, భరత్‌నగర్ కామాన్ వద్ద బీమనపల్లి యాదయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేసి ముగ్గురి వద్ద ఉన్న మద్యం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మీర్‌పేట: మీర్‌పేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం మిథులానగర్‌లోని హోలీకింగ్స్ చర్చిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దానిబాబు, ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్, ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా ఐజక్, కార్యదర్శిగా జయపాల్, కోశాధికారిగా జాన్, హరిబాబు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా ప్రమోద్, జయపాల్, న్యాయ సలహాదారులుగా యాదల కిషోర్‌బాబు, వై.గురవయ్య, సలహాదారులుగా డా.ఎడ్గర్ సాతులూరి, జోసెఫ్ ఇమ్మానుయేల్ ఎన్నికయ్యారు.

స్పెల్‌బీలో విద్యార్థుల ప్రతిభ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని లార్డ్స్ ఒలంపియాడ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో స్పెల్‌బీ పోటీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు మైండ్ వార్స్ సంస్థ నిర్వహించిన ఆంగ్ల పద కోశ ప్రావీణ్య పరీక్షల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు గ్లోబల్ భాషలో పట్టు సాధించేలా శిక్షణ పొంది ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బానూరి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.